# గెలుపూ - ఓటమీ

"ఏం దుకమ్మా! ఆ ముసిముసి నవ్వులు?"

"నిన్ను చూసే...."

"నన్నెందుకు చూసి?"

సమాధానంగా బుర్రగోక్కున్నాడు గోపాలం. అది చూసి, ఆమె ప్రదర్శించిన చిరుకోపం మరిచి పోయి కిలకిలా నవ్వేసింది కల్పన.

'ఎందుకేం ఆ నవ్వు? ముత్యాలొలకపోద్దామనా?'' పాఠం వప్పచెప్పనట్లు న్నప్పటికీ ఆ ప్రశ్న తాత్కాలికంగా గోపాలాన్ని రక్షించింది. తానెందుకు నవ్విందీ చెప్పనవసరంలేదు.

"మరేం...." జారిన పయిట సర్దుకుంది కల్పన. నవ్వాపుకునేందుకు ప్రయత్నం చేస్తూ.

"మీరా ముత్యాలు ఏరుకుంటారా ఏం?" అనడిగింది.

"వుహూఁ... చూసి మురిసి పోతాను."

"అయితే అలాగే మురుస్తూ వుండండి... నేనింక పోతున్నాను...."

కల్పన లేచి నిలబడి పైట భుజం మీదకు సర్దుకుంది. ముంగురులు సవరించుకుంది.

చిరుగాలి ఆమెముంగురులతో నుదుట కార్టూన్ బొమ్మలు గీస్తానంటోంది. ఆమె వద్దంటోంది.

"ఒక్క ఐదునిమిషాలు ప్లీజ్!"

అంతవరకూ చేతులు మెలివేసుకుని దొప్పలా తల క్రింద పెట్టుకుని పడుకున్న గోపాలం మోచెయ్యి మీదికి లేచి, అనంతశయనం ఫోజులో ప్రార్థించాడు.

"నే నతగాడి పార్టీయే..." అన్నట్లు ఆమె సిల్కుపయిట సాటిన్ జాకెట్టు భుజం మీద నుంచి జారిపోయింది!

"అమ్మబాబోయ్! మీ సొమ్మేం పోయింది?. నా కవతల పనులున్నాయ్?"

మోకాళ్ల మీద వాలి కూర్చుని చిలిపిగా చూసి, కళ్ళు టప టప లాడించింది కల్పన.

"ఏమిటో ఆ పనులు? యీలా చూడు, యిక్కడ యీ చక్కని మెత్తని పచ్చిక నీ అడుగులకు మడుగులొత్తుతా నంటుంది.. ఈ చిరుగాలి నీ చెంపలను తాకి మురిసి పోతోంది... అదో ఆకాశం నీ కోసం నక్షత్రాలను పొదుగుతూంది.."

"తమరు హాయిగా వెల్లికిలా పడుకుని, కవిత్వం చెబుతున్నారూ?" అంటూ పూర్తి చేసింది కూర్చుంటూ. వెంటనే పారవశ్యం ప్రదర్శించేందుకు ఠపీమని లేచి కూచున్నాడు గోపాలం.

"ఎక్సెల్లెంట్! నేనే ఓ రాజునయితేనా నీకు, నా మెళ్లోని హారం యిచ్చేద్దును." అన్నాడు.

"నయం. ఆ టై విప్పి నా ముఖాన పారెయ్యకండిమీ..." కొంచెం జరిగి మంచిముత్యాలు గాజుగళాసులో వలకబోసినట్లు కిలకిలమంది కల్పన.

రెండు క్షణాలు మవునంగా వుండి, గోపాలం "కల్పనా!" అన్నాడు.

అతగాడికి భాషంతా మరిచిపోయినట్లయింది.

ముందే తన ప్రశ్నలూ హించుకుంటుందా యేమిటి చెప్మా యీ పిల్ల? అనుకున్నాడు.

కల్పన తోటి స్నేహం సంవత్సరం నాటిదే అయినా తనకా పిల్లతో సాహచర్యం యుగయుగాలనాటి దనిపించింది. తన నా పిల్ల యిలాగే వుడికిస్తూన్నట్లనిపించింది.

ఒక్క టెన్నీస్ ఆటలో తప్ప యింకెందులో యీ పిల్లతో పోటీపడగలను నేను?

ఆ పిల్లమీదికి పెంకిమాట, కొంటెమాట విసరటం, గోడమీదికి బలంపూనా, సూటిగా బంతిని విసిరి కొట్టడమే. ఫెడీమని తిరిగి వచ్చి తగుల్తుంది.

ఎంతటి స్వాతిశయం వున్న పురుషుణ్ణయినా ఆమె కనుబొమల ముడితో తునాతునకలు చేస్తుంది.

మొదటిసారి కల్పనతో తనకు పరిచయమైన దృశ్యం గుర్తుకువస్తే యివాళ కూడా ఒళ్లు పులకరిస్తుంది గోపాలానికి.

×××

ఒక్క టెన్నీస్ ఆడుతున్నప్పుడు తప్ప, గోపాలం యెప్పుడూ సీరియస్‌గా వుండడు, వుండలేడు.

సాధారణంగా అతని మిత్రబృందం యెవ్వరూ అతనితో చమత్కార ద్వంద్వయుద్ధానికి తలపడరు. పైగా తెగ మోసేస్తారు.

అది ఒకసారి పిక్‌నిక్ వెళ్లినప్పటి సంగతి.

క్యారంసు ఆడుతున్నప్పుడు, కార్యరంసు ఆడటం కంటే యెక్కువగా గోపాలం మిగతా అందర్నీ ఆటపట్టిస్తాడు!

సరిగ్గా ఆవేళ ఆ క్యారంసే అతన్ని కల్పన చూపుల కెరచేసింది.

అంజనేయుల్ది ఛాన్సు. అతగాడి వాలకాన్ని చూసినప్పుడు గోపాలం "ఓరినీ!మరీ అంత కాన్‌సెన్ ట్రేషనా?.. నువ్వా పిక్కను కొట్టడానికి వుద్యుక్తుడవుతున్నప్పుడు- నీతీరు నీకో నిలువు టద్దంతో చూపిస్తే..'నని వెటకారం చేశాడు.

నిజమే అంజనేయులు తన మీదిపళ్ళతో కింది దవడను, అవి సుమారో అంగుళంలోతు దిగేలా గ్రుచ్చి, కళ్ళను కళ్ళను మూలగాపెట్టి తలకాయను నలభై డిగ్రీలూ,కాయమును పాతిక డిగ్రీలూ వాల్చి, చెయ్యి వణకగా, పిక్కని స్ట్రయిక్ చేసేడు. రెడ్‌నూ, దాంతోటి వయిట్‌నూ పాకట్‌లోకి నెట్టాడు. కానీ గోపాలం మాటల్తో అతని మొహం కందిపోయింది. మూతి అతనిని సార్థక నామధేయాణ్ని గుర్తు చేసింది.

ఈ కబురు, ప్రక్కనే మరొక బోర్డుమీద ఆడుకుంటున్న అమ్మాయిలకందిపోయింది. ఫకాలున నవ్వారు వాళ్లు. గోపాలం తెలివికీ, విట్టుకీ సంతోషపడి! కానీ నలుగురు విద్యుల్లతల్లోనూ ఒక చిన్నది నవ్వలేదు. గోపాలాన్నికనుబొమ్మలతో బుస్సున చూసింది.

అంజనేయులెంకందిపోయాడు? - గోపాలం చమత్కారోక్తికి?

ఆ పిల్ల చూపుల ఎర్రదనానికి కందిన గోపాలం మొహం చూడాలి.

గోపాలం ఎందుకో గుంజాటన పడిపోయాడు.

పిక్‌నిక్ పార్టీ రంజుగానే వుంది.

కల్పన రెండు జడలలోనూ, ఒకటి ముందుకు కృష్ణసర్పంలా వుంది ఆమె కుచోన్నతం మీద! కాలురున్న జాకెట్టు ఆమె శంఖంలాంటిమెడను ఆప్యాయంగా హత్తుకుంది.

దానిమీద అంచులేని నీలం చీర రాణించింది.

అటు తరువాత గోపాలం ఎంచేతనో విట్మాస్టర్‌లాగా అదేపనిగా వాగడం మంచిది కాదనుకున్నాడు. ఒకటి, రెండుసార్లు ఒక రిద్దరుమిత్రులు అతగాడిలోని యీ ఆకస్మాత్ చైతన్యానికీ లేదా, స్తబ్ధత్వానికీ, విస్తుపోయి, అడిగేసేరు కూడాను.

ఆనక గోపాలం ఉండబట్టక నిరంజనమూర్తి నడిగేడు. "ఓయ్! నిరంజన్, ఆ మూడో అమ్మాయి యిష్... చెయ్యివద్దులే.. అదే అదో ఆ నీలంకోక సన్నని రెడ్‌చాప్ యెవరూ.." అని.

నిరంజన్ సన్నగా నవ్వుతూ, చెయ్యి చూపుతూ,

"ఓ! వయ్యారపు బొమ్మలా వుంది. అదో పైట జారిపోతేయిలా తీసుకుంటుందే జానకీ. ఆమెకీ, శారదకీ మధ్య.. అవునా?"

గోపాలం నిరంజన్‌మూతిమీద కొడదామనుకున్నాడు.కానీ, "ఆ ... ఆ పిల్లే.. ఎవరో నేను ఎప్పుడూ చూడలేదుసుమా.." అన్నాడు. తనకు అత్యవసరంగా కలిగిన అనవసర కుతూహలాన్ని దాచ

కథా నిలయం
3926
శ్రీకాకుళం

ప్రయత్నం చేస్తూ.

"రా! పరిచయం చేస్తా.." దారి తీసేడు నిరంజన్.

"ఓయ్! ఓయ్! ప్లీజ్! నన్ను యిలా బ్రతకనీ"... చెయ్యి వెనక్కు లాక్కున్నాడు గోపాలం.

"నో.. నో.. మనం ముందుతరం మనుషులం." అంటూ నిరంజన్ గోపాలం చెయ్యి బుచ్చుకుని, "డోంట్‌వర్రీ! ఆ పిల్ల నాకు కజిన్.. వెడదాం రా.. నేనెలాగ వెడుతున్నా" నన్నాడు.

"ఐ.సీ""

గోపాలం లోపల సంతోషం, బయటకు ధైర్యం తెచ్చుకున్నాడు. కానీ "ఇంకానయం ముందే చెప్పావ్. లాపోతే ఏమి వాగుదునో" అనుకుని లోలోపల మిత్రుణ్ణి అభినందించాడు.

జానకి కొరకొరా, శారద చురచురా చూసేరు. కల్పన "ఏం బావా!" అని పలుకరించడంతో వాళ్లిద్దరూ కోపావేశం చల్లార్చేరు.

"నీకోసరమేకల్పనా! మా అమ్మా వాళ్లు నిన్నో సారి రమ్మన్నారు...వూర్లోకివచ్చి చదువుతూ, మా యింట కాదనీ హాస్టల్‌లో వున్నావ్... పైగా యింటికయినా ఓ మారు రావూ...."

కల్పన నొచ్చుకుని, "లేదుబావా! తప్పకుండా
రేపు వస్తా. అత్తయ్యతో చెప్పు" అంది.

ఆవేళ కల్పన బావకివ్వవలసిన చనువూ, అతగాడి ప్రక్కనేవున్న అపరిచిత వ్యక్తికి లజ్జా ప్రదర్శించిన తీరూ ముగ్ధుణ్ణిచేసింది గోపాలాన్ని. ఆ దృశ్యం యిప్పటికీ పటం కట్టినట్లు ఉంది అతని హృదయంలో.

"ఇతను గోపాలమూర్తి అని టెన్నీసులో దిట్ట" పరిచయం చేశాడు... గోపాలాన్ని నిరంజన్.

"ఈమె కల్పన... ఫస్టీయర్... టెన్నీస్ అంటే చెవికోసుకుంటుంది..."

కల్పన నమస్కారం పెట్టింది. గోపాలం అందుకుని,యేదో తన మామూలుధోరణిలో వాగబోయి వూరుకున్నాడు!

xxx

ఆ పరిచయం యీ చనువుగా ఏర్పడింది.

నిజం చెప్పాలంటే యిద్దరూ ఒకరికి చెప్పకుండా వకరు దోబూచులాడుతున్నా... అదే ప్రేమ అనే మాయదారి వ్యవహారం అని యిరువురి హృదయాలూ స్వగతాలు పలికేశాయి.

గోపాలం తనే అన్ని విషయాల్లోనూ క్రింద వాడవడంతో ఓటమి కాదుకదా? అనుకున్నాడు లేకపోతే. సీరియస్‌గా మాట్లాడాలని, తను ముఖ్యమైన సంగతులు మాట్లాడాలని అనుకుంటే కల్పన కెరటంలా చురుగ్గా చిలిపిగా వుంది. గంభీరంగా బరువుగా, మేఘంలా వుండాలని తాను ఎంత

ప్రయత్నించినా అవదేం?

పైగా తన నేగాడిదనో, కోతినో చేసి, గడ్డి పరక ఎలా? వుందనో "నా ముక్కు దురదనో" అంటుంది కదా!

గోపాలం అన్నాడు.

"సరే! అంత పాతాలు చదువుతానంటే వెళదాం గాని... ఒక్కమాట!" లేవనుంకించాడు గోపాలం.

"మరొక్క అయిదు నిమిషాలా?" అడిగింది.

ఏదో చెప్పబోయే గోపాలం మూడ్ చితగొట్టేసింది ఆమాటతో కల్పన.

"కాదువెంటనే పోదామనీ..." అని గబగబ నడిచేడు గోపాలం.

"నన్ను రిక్షా ఎక్కించి మరీ వెళ్లండి" నవ్వుతూ అనుసరించింది కల్పన..." నేనుపరిగెత్త లేను".

2

బియ్యేకి ఆవేళ ఆఖరి పేపరు రాసింది కల్పన. గోపాలం ఎమ్మేకి మలి సంవత్సరం పరీక్ష రాయాలి.

పరీక్షలయిన సాయంత్రం అది.

నీరసం యెంతో దిగలాగుతూవున్నా, నిద్ర లేమితో కళ్లు ఎంతోలోతుకి పీక్కునిపోయినా, కల్పనలో ఒక రకమయిన నిశ్చింత నిండింది. ఆమె కనుల కాంతులు నిండేయి!

"వుహూఁ నేను టాంకబండ్ మీదికేగాని పబ్లిక్ గార్డిన్స్‌కి రాను."

గోపాలం ఆ పిల్ల ముడివేసిన ముద్దు మొహంల్లోకి చూస్తూ "నిజంగా.. గార్డెన్స్‌లో లాన్‌మీద కూచుంటే.. ఎంత హాయిగా, రిఫ్రెష్‌డ్‌గా వుంటుందో తెలుసా? అందులో యివాళ..." చెప్పేడు.

హఠం పట్టింది కల్పన

"వుండదు... పైగా... మీకు పడుకో బుద్దేస్తుంది, గడ్డిమీద... ఆనక కవిత్వం వస్తుంది. గడ్డిపరకలు తిన..." బుద్దేస్తుంది అన్నమాట ఆమె నవ్వుల్లో కలిసిపోయింది.

"అమ్మాయ్! కాస్త నవ్వు దాచుకో.... వేడి పరీక్షలు రాసిరాసి నీ మొహం ఎలా అరిటాకులావాడి పోయిందో చూడు! అలా నవ్వితే మరింత నీర్సం వచ్చేను..."

నిజంగా గోపాలం, ఆమె ఆరోగ్యం గురించి బెంగపడ్డాడు. "నీకు రిక్రియేషన్ అవసరం...పోనీ సినీమాకెడదామా? నీ పరీక్షలయినందుకు అది నా ప్రెజెంటు...." చెప్పేడు.

"వుహూం... నాకు అయిస్‌ఫ్రూట్‌చాలు... కావాలంటే మీరు "పేతా" తినండి...." చంటిపిల్లలా బుర్ర తిప్పింది కల్పన. నిజంగా పేపర్లన్నీ చాలా బాగా రాసిందేమో ఉద్దేలంగా వుందామె మనసు.

"ఓ.కే."- గోపాలం వీగిపోయినట్లు "పదండి దేవిగారూ.. టాంక్‌బండ్ మీదకే ...అక్కడ రాతి కుర్చీలో రాణిగారు ఉపవిష్టులయితే యీ దాసుడు అయిస్ క్యాండీ కొని సమర్పించుకుంటాడు." అన్నాడు.

సిగ్గుపడిపోయింది. ఆమె పెదవులమీద నవ్వులు వెలిగాయి.

"దేవి!" "రాణి" అనే మాటలు ఆమె హృదయాన గిలిగింతలు పెట్టేయి.

వెంటనే అంది "అయ్యా! రాజాగారు... గార్డెన్స్‌కే వెడదామ్..."

"ఓహోహో... మరి చిన్నతనం ఎక్కువయిపోతూందే?.... అటంటే యిటూ, యిటంటే 'అటూ' కల్పన యింక గోపాలం దగ్గర భయం నటించినట్లు మొహం పెట్టేసింది. ఇలా అంది.

"పరీక్షలు పాసయ్యేనుగా... ఆ మాత్రం కోరిక తీర్చరూ..."

"ప్యాసెప్పుడయ్యేవ్...?"

"రాసినపుడే!" -యిద్దరూ నవ్వుకున్నారు.

గూళ్ళు చేరే పిట్టలు కానరావడం లేదుగాని సంధ్య వేళ పంజరాలను వదిలి బయటపడ్డట్టు జనం; జంటలూ, గుంపులూగా, షైరుకి బయలుదేరేరు.

ఆఫీసులనాలస్యంగా వదిలిన ఘటాలు, బస్‌స్టాపుల్లో ఆముదం తాగినమొహాలతో నించున్నాయి!

పాజమా షేర్వాణీ రెండు జెడలూ, కాలికి హైహీల్డు బూట్లూ, వేసుకున్న "బొద్దుసుందరీ" ఒకతే నైలాన్ చీరె సాటిన్ బ్లవుజూ,.... దాంతుంపతెగ..... అరటిపండు తొక్కమీదపడ్డకాలయినా కాస్సేపు ఆగుతుందేమో గాని, ఆ నైలాన్ పయిట సాటిన్ భుజంమీద వుండదే!

ఆవిడ నెట్ వేసుకుంది. బంగాళా ముడి ధరించింది. ఆమె అవయవాలను దాచవల్సిన అవసరాన్ని ఆమె దుస్తులు గమనించవు. ఆ సంగతి ఆమె గమ్మనించదు.

గోపాలం ఆ రెండురకాల అలంకరణలలోనూ, కల్పనను వూహించుకొని చూడబోయేడు.

"ఉహుం యిలాగుంటేనే బాగుంది కల్పన, ఈ ఖటావ్‌వాయిల్ చీరెలో చెంపలమీదకి జారిన శిరోజాల సొంపులతో, ఒంటి జెడా... చేతికి రెండేసి బంగారుగాజులు, కాలికి ఆకు చెప్పులు.... రేక బంతిపువ్వులాగుంది కల్పన..."

నడ భవంతి లాగుంది డబుల్ డెక్కర్ బస్సు తప్పుకోమని అరిచింది హారన్.

ఉలిక్కిపడి గోపాలం తప్పుకున్నాడు.కల్పన నవ్వి "ఏమిటో పరధ్యానం? భావకవిత్వం రాస్తారా యికమీదట?" అన్నది.

"ఏమ్మో పరీక్షలు లాపొతే అలాగే చేద్దును. నిన్ను చూస్తే కవితావేశం వస్తోంది తెలుసా?"

రంగురంగుల నాగరికత. రకరకాల వాలకాల జనతా, పబ్లిక్ గార్డెన్స్ కనులపండువుగా వుంది.

చీకట్లు వాలినకొద్దీ దీపపు కాంతులు వాటిని మేసి బలుస్తున్నాయి!

కోనేటిలో రకరకాల పూలకుమల్లే పచ్చిక మెత్తలమీద అంగనలూ అంగరక్షకులూ... ఆడా-మగా....

నీటి చిమ్మటాలు చిమ్ముతున్న జల్లు మీద... రంగురంగుల కాంతిపుంజాలు నృత్యవిన్యాసాలు చేస్తున్నాయి!

కల్పన ఆ నీటి తుంపర్లలోకి వెళ్లింది. ఆ పిల్ల మనసూ అలాగే తన్మయంగా వుంది. జల ద్వారాల, క్రింద నుంచి అటూ యిటూ తిరుగుతోంది.

అక్కడ ఆడుకుంటూన్న చిన్న పిల్లలతోనూ కలిసిపోయింది.

"కల్పనా! నీటిజల్లు క్రింద తడిస్తే యేమవుతుందో తెలుసా?" గోపాలం వారించబోయేడు.

"లేదు మాష్టారూ! మీ సివిక్సులో చదివిన జలుబు నాకు చెయ్యదు... యిలారండి... యీ జల్లు కితకిత లెడుతోంది చూడండి"

పచ్చని ఆమె నుదుట నీటి తుంపరలు చిరుముత్యాల్లా నిలిచేయి!

గోపాలం యిక తప్పదన్నట్లు, బూట్లు పాడైపోకుండా, నీళ్లు మడుగుకట్టిన ప్రాంతంలో కుప్పిగంతువేసి చిమ్మటాల జల్లు ననుభవించి "ఓ.కే యింక పోదామ్" అన్నాడు. క్రాపును సవరించుకుంటూ. అతని ఆందోళనేగాని అబాల గోపాలమూ, ఆనందంతో ఆవేశంతో కేరింతలు కొడుతున్నారు. అతని క్రాపు సంగతెవడిక్కావాలి?

"అమ్మయ్య" ఆయాసపడి మెత్తంమీద చతికిలబడ్డ కల్పన పయిటకొంగుతో నుదురు ఒత్తుకుంది. "మొత్తానికి ఒకటయ్యింది!" నిబ్బరంగా అన్నది.

దూరంగా కొంతమంది యువకులు కూచుని కల్పనవంకే చూడడాన్ని యీర్ష్యతో గమనిస్తూ "ఏమిట"ని అడిగేడు గోపాలం.

"బి.య్యే"

"తర్వాత?" ఆనందంతో అతని మొహం నిండింది.

"వుద్యోగం చేస్తా..." చెప్పింది కల్పన.

గోపాలం తనకి తెలియకుండానే 'హర్ట్'అయ్యేడు! "ఛీ ఛీ! వుద్యోగం చేస్తావా? అన్నాడు.

అతని కాసమాధానం అనుకోని పిడుగులా పడింది. కమ్మని సంగీతంలో అపశ్రుతిలా తోచింది అతనెన్నడూ వూహించ లేదు కల్పన వుద్యోగం చేస్తుందని.

"అంటే, మీ వుద్దేశం ఏమిటి?" కల్పన సీరియస్‌గా అంది! ఇది మరింత నొప్పించింది గోపాలాన్ని.

అది గ్రహించినట్లామె అన్నది

"పురుషలక్షణం గదా వుద్యోగం? అబలను నాకెందుకూ అనా? మీ వుద్దేశం... నో. యీ మధ్య అతివలకు కూడా ఉద్యోగం యొక్క అవసరం వుందని తీర్మానించేం"

ఆమె నవ్వులో యీసారి ప్రయత్నం వుంది. నిజానికి అది గోపాలం అహంకారాన్ని గేలి చేయడమే.

గోపాలం అడిగేడు "నీకవసరం అన్నమాట"

కల్పన సెలయేటి త్రుళ్లింతలు మాని మంచి నీళ్ల మడుగయినట్లు రెండు క్షణాలాగింది!

"మరి?" అన్నది. ఒక గడ్డిపరక తుంపింది ముని గోళ్లతో. తిరిగి చెప్పింది. "మా అన్నయ్య నా చదువుకి యెన్నో యిబ్బందులు నెట్టుకొచ్చేడు. నిజంగా మా ఒదినె అంతగంటే సహకరించింది... లేపోతే నన్ను ఆరేళ్ళ క్రితం ఓ అయ్య, చేతబెట్టి వుంటే.. యివాళ మీరు అయిస్‌ఫ్రూట్ కొనాల్సిన అసరం వుండక పోను!..." కల్పన గంభీరంగా చెప్పింది.

గోపాలం, వినడమే ఉత్తమం అనుకున్నట్లు మాట్లాడలేదు.

"... అన్నయ్య కిద్దరు పిల్లలు ... ఒదినె ఆరోగ్యం దిగజారిపోయింది. ఆవిడకీ ట్రీట్‌మెంటు అవసరం..."

అతనికి మనస్సు వికలమయిపోయింది. దాన్ని తేలికగా తీసుకుందామంటే, అది మరింత బరువుగా గుండెల్లో మెదిలింది.

కల్పన వుద్యోగం చేస్తే తనకేం?

కల్పన తన భార్య కావాలికదా మరి?

గోపాలానికి భార్య అవదల్చుకుంటే వుద్యోగం యెందుకు చెయ్యగూడదో... అదేమేనా అనర్ధమా?... గోపాలినికిది తర్కంగా తోచలేదు.

తను భార్య ఆర్జించడం, వుద్యోగం చెయ్యడం అతనికి వూహించడం కూడా సయించలేదు. అంతేకాదు కల్పన 'అన్న' సంసారాన్ని పంచుగొంటానంటుంది. మరి కళ్యాణం తల పెట్టదనేగా దానర్ధం. తనను ప్రేమించిందని తను భ్రమిసిన పిల్లేనా యీ మాటలు? అతనికి ఆలోనలు పాలుపోలేదు.

"అయితే నువ్వు... నువ్వు...." నీళ్లు నమిలేడు.

"నేను నేనే" కల్పన తనకేసి యిలా చూసుకుని నవ్వేసింది.

"అయితే వుద్యోగం చేస్తావు? తర్వాత..." కల్పన మామూలు ధోరణిలో నయితే ఆ ప్రశ్నతోనే అతగాడిని ఆటపట్టించేదేమోగాని.

అతగాడి కళ్లల్లోకి చూసి "తర్వాత?" అనడిగి సిగ్గుపడిపోయింది. ఆమె కళ్లల్లో కాంతి మెరిసింది. ఎదనేమో పులకింత జలదరించింది.

"మీరు కవిత్వం రాస్తానన్నారు గాని, కన్నె మనసు బొత్తుగా తెలియదు సుమండీ..." తలదించుకుని, వేళ్లతో సున్నితంగా లాన్‌ను తాటిస్తూ చెప్పింది.

వుద్యోగం అన్నమాట? అతని తలలో దూరింతర్వాత కల్పన చిలిపితనం, గోపాలాన్ని ఆహ్లాదపర్చలేకపోయింది. అతని అహంకారం దెబ్బతిన్నది.

"నేను దేనికి కవినవుతాలే... అసలు ఎడ్వాన్స్‌డ్ యేజ్‌వాణ్నేగాదు?.... వుత్త క్రూడ్ మనిషిని....' కసిగా అన్నాడు.

కల్పన మొహం వాడిన పువ్వులా కళావిహీనమయిపోయింది. అతగాణ్ని లాలించలేకపోయింది.

సంవత్సరం నించీ వున్న పరిచయంలో తాను యెన్నిరకాలుగా వుడికించింది గోపాలాన్ని? ఒక్కోసారి యింటికివెళ్లి బోర్లా పడుక్కుని విలపించింది కూడాను. "ఆయన్ని అవమానం చేసి ఆటపట్టించిందికి నేనెవర్తిని? నిజంగా ఆయనెంతో మంచివాడు, పురుషునిలో వుండే ఆడదాన్ని అణచాలనే దురహంకారం ఆయనలో లేదు. వుంటే నేనిలాగ వేలాపాళా లేకుండా వెటకారం చేయగల్దునా...." అని తలపోసేది.

ఆ గోపాలమే, తను మనసు విప్పి మాటాడితే అపార్థం చేసుకునేటట్టు దిగజారిపోడం ఆమెకి సమ్మెటపోటులా తగిలింది.

"అయిస్‌ఫ్రూట్ కాండీ" వద్దంది కల్పన. మరి కొంటానని బ్రతిమాలలేదు గోపాలం. కల్పనను రిక్షా యెక్కించి , కాళ్లకి రబ్బరు సంకెళ్లు వేసినట్లు బరువుగా నడక సాగించేడు.

## 3

ఏ.జీ. ఆఫీసు సూపరింటెండెంటు కొడుకూ రిటయర్డ్ జడ్జీగారి మనుమడూ అయిన గోపాలం తనకు భార్యకావాలని కోరుకునే కన్నె వుద్యోగం చేస్తానంటే విలవిలమనడంలో ఆశ్చర్యంలేదు. ఆడపిల్ల వుద్యోగం అవసరంగా భావించే సందర్భాలు యెలా వుంటుంటాయో అతగాడు వూహించలేడు.

"కోడలు రావాలనీ నట్టింట దీపమెట్టాలనీ' కోరే అతగాడి తల్లిదండ్రులకి వుద్యోగంచేసే కోడలంటే కలలోకి రావడం కూడా యిష్టముండదు.

కల్పన తనకి కానట్లు - తన చేజారిన ముత్యమయినట్లూ వెలితిగా అనిపించింది.నిస్సత్తువ వచ్చింది.

నాన్నకిగాని అమ్మకిగాని "మరేం... నా ప్రేయసి వుద్యోగం చేస్తూంది. నేనామెను చేసుకుంటాను"అని చెప్పగలగడం యింపాజిబిల్... అది తనకి కూడా తలవొంపు...

దానికి సమాధానం వచ్చిందతని మనసులో "ఈ సంవత్సరం తను చదువుతున్నాడుగా...మలి ఏడాది వుద్యోగం మానీవచ్చుగా కల్పన ? అప్పుడు యిది సమస్య ఎలాగవుతుందీ అని సరిపుచ్చుకున్నాడు.

కాని తన కాబోయే భార్య వుద్యోగం - ఒక ఆఫీసులో పదిమంది మధ్యా పూడిగం? నాన్‌సెన్సు... అది తను సహించలేడు. కల్పన లావణ్యం మార్దవం అప్పుడే పోతున్నట్లనిపించిది.

గోపాలానికి చాలా కష్టమనిపించింది.

కల్పనతో చెబుదామా అంటే "యింత సంకుచితం యింత అహంకారం పనికిరావని" కించ పరుస్తుందని భయం వేసింది. పురోగతికి విద్యాధికుడయిన నువ్వే అడ్డుపుల్లలు వేస్తున్నావు! "నేనేం మీసొత్తు నీ, మీ నగనీ కాదు. బానిసత్వం చెయ్యను" అంటుందేమో?

అతగాడు తనలోతానే కల్పనకు బోధపరచడాన్ని మననం చేసుకున్నాడు.

"అది కాదు కల్పనా! నువ్వంటే నాకంత ప్రేమ గనకనే... నిన్ను నే నొక్కణ్ణే ఆరాధిస్తాను. గుండెల్లో దాచుకుంటాను" అని కాని, అతని ఎదలో కల్పన "నాకూ ఆదర్శాలున్నాయి అవసరాలు న్నాయి" అని కేకవేసింది.

హతాశుడై, ఒళ్ళు మండించుకుని "అయితే వురెట్టుకు చావనీ" అనుకున్నాడు పిడికిలి బిగించి.

కల్పనను కూడా ఆలోచనలు ముట్టడించేసేయి. పరాధీనమయినట్లుంది ఎదను. ఆయనని నొప్పించేనా అని మధనపడ్డది.

రెండు రోజుల్లోతనావూరు వదిలి వెళ్లి పోతున్నది. గోపాలం ఎడబాటు సహించడం అసాధ్యమనిపించింది.

వరంగల్‌లో వుద్యోగం చూసుకుంటే యింక యీ వూరు, యీ జీవితం, యివి దూరమై పోడమే?... ఆ తలంపు భయాన్ని కలిగించింది. దాన్నించి తప్పించుకోవాలని చూసింది.

కాని అన్నయ్య?

ఒక సంవత్సరం కనీసం గోపాలం ఏమ్మే అయిపోయేంతవరకూ, తాను అన్నయ్యని ఆదుకొనకపోతే తనకీ ఆత్మతృప్తి వుండదు. అటు అన్నయ్యకీ కూడా తనని కన్యధార పోయగల స్తోమత వుండదు అనుకుంది.

## 4

"సమాజం బాగుపడాలంటే స్త్రీలకి కూడా తమతోపాటు సమాన ప్రతిపత్తినికలిగించాలంటే....' ' తను బల్లగుద్ది డిబేట్‌లో చేసిన వుపన్యాసం కత్తిరింపులతో సహా,కల్పన ఉద్యోగ సమస్య ఎదుట నిలుచుంది. ఒక వంకతను..."

"అన్ని ఆదర్శాలూ అన్ని త్యాగాలూ అన్నీ తన నెత్తినే చుట్టుకోవాలా? తనొక్కడేనేమిటి యీ సమాజం! అభిమానం తను చంపుకుంటే అదెంత యీ సంఘానికి... మహాసముద్రంలో కాకిరెట్ట... ప్చ్... లాభం లేదు... కల్పనది మొండితనం.... మూర్ఖత్వం... వుద్యోగంచెయ్యడం సరదా. సంసారిపిల్ల న్నవుదామని లేదు... వుద్యోగాలు చేసి ఊళ్లు ఏలుదామని.. అసలు తనంటే అపిల్ల కెన్నడైనా ఖాతరుంటేగా!... తనదే తప్పు... తన సర్వస్వం ఆ పిల్లకి సమర్పించడం తన తెలివి తక్కువ...."

సతమతమయ్యేడు గోపాలం. అమ్మో కల్పనను ఎడబాయడం ఎలాగ!

పోనీ యీ సంవత్సరమే పెళ్లాడుతే...

సిగ్గేసింది. మొదట కల్పనకి పెళ్ళి చేసుకోమని చెప్పడం ఎలాగ! "అన్నయ్యో ఒదినో" అని అలమటించే అమ్మాయిని "నన్ను పెళ్లాడూ" అని అడగడం ఎలాగ?

మరి తన తల్లిదండ్రులమాట?

ఎం.ఏ., గాకుండా పెళ్ళి చేసుకోడం యింటావంటా లేదంటాడు నాన్న... ఎం.ఏ., పరీక్షలు కట్టరా అంటే నేనో అమ్మాయికి తాళిగడతానూ... అని అడగం ఎలా?

పరిస్థితులను యెదుర్కొనే సాహసం లేదు గోపాలానికి.

అభిరుచులను కాదని అహంకారాన్ని తోసి రాజనడానికి శక్తి లేదు గోపాలానికి.

కల్పనమీద కోపం వచ్చింది.

మర్నాడు వెళ్లననుకున్నాడు కసిగా...

అసలు కల్పన వాళ్ల వూరుపోయి యీ ప్లాట్‌ఫారమ్ యీ విద్యాలయంలాగే తననూ మరిచి పోతుందేమో? "అసలు మరోనాడుసీరియస్‌గా వుంది గనకనా" అని తలపోసేడు.

తెల్లవార్లూ నిద్రపట్టలేదు.

పుస్తకం చేతబడితే ఒక్కముక్క తలకెక్కలేదు.

అద్దాల బీరువాలోనించి వెండి మెడల్సూ తళతళ మెరిసి, పకపకా నవ్వుతున్నట్లుంది.

అవన్నీ స్త్రీ జనాభ్యుదయం మీద స్త్రీ తత్వంమీద పొగిడి తాను సంపాయించినవే...

తనలో తనకి డిబేట్ జరగడంతో గోపాలానికి తనమీద తనకి కోపం వచ్చింది!

×××

ఉదయం కల్పన ఫోన్ చేసింది. తనకి కల్పనే అనిపించింది. వెంటనే యెత్తు కోకపోతే అక్కడే పేపరు తిరగేస్తున్న నాన్న "హలోవ్" అంటాడు. అవతలివేపు వాళ్ల పుట్టుపూర్వోత్తరాలు అరాతీసి ఆనక తనని పట్టుగుని క్రాసు పరీక్ష మొదలెడతాడు. తండ్రి వుద్యోగం కాక పోయినా తండ్రి పోలిక తన తండ్రిది !

గోపాలం ఫోను ఎత్తుకున్నాడు.

కల్పనే...

తండ్రికి ఆ ఫోన్‌కాల్ తనది అని చెప్పాలిగా...

"ఇది నాది నాన్నారూ" అన్నాడు.

అట్నుంచి కిలకిలమనేసింది కాబోలు కల్పన, రిసీవరు చెవులో కితకితలు పెట్టింది.

"ఆ మవుత్‌పీస్... మూసి చెప్పరాదూ? లాపోతే కొంపతీసి... నన్నే మీనాన్నగారికి పరిచయం

చేస్తున్నారా....?

"నేనొస్తున్నా" నన్నాడు గోపాలం.

"నేనూరికి పోవాలి మరి... త్వరగా రాండి...రాపోతే అంత ఒట్టు"

గోపాలం కరిగిపోయేడు.

కల్పన మళ్లీ అతని హృదయపీఠం మీద పూజాపురస్కారాదులతో సహా అలంకరించింది.

అవును తన వస్తువు... వస్తువేమిటి? తనదే కల్పన....

తండ్రికేసి చూసి "నాన్నారూ! నా కల్పన" అని అందామనుకున్నాడుకాని పెదాలు బిగుసుకు పోయాయి. విడలేదు.

×××

కల్పన ఎంత ప్రయత్నం చేసినా ఎడబాటును సహించలేనన్న వ్యథ ఆమె మొహాన పులుముకుంది.

గోపాలం బేలపడి పయేడు.

"మరి యీ సంవత్సరం అంతా నన్నేం చేయమన్నారు?"-అడిగింది కల్పన.

మరింత చలించిపోయాడు గోపాలం.

కల్పన కళ్లు కదిపితే స్రవించే మేఘాల్లాగున్నాయి.

"నీయిష్టం" తన మాటలు వుపసంహరించుకోగలశక్తి వుంటే ఆపని చేసేవాడే అతగాడు.

"సరే! వంట పండడం, ఒడియాలు పెట్టటం నేర్చుకుంటా? "నవ్వడానికి ఆమె ప్రయత్నం చేసింది.

"ఉద్యోగం ఎక్కడ చేస్తావు?" గోపాలం ప్రశ్న.

"ఆడపిల్లల బళ్లో" ఆ సమాధానం గోపాలానికి దవడ మీద కొట్టినట్లు తగిలింది.

"కాని తమరు పర్మిషన్ గ్రాంటు చెయ్యాలిగా!" అంది కల్పన. గోపాలం చిత్తయిపోయాడు.

"కల్పనా! నీదే ఎప్పుడూ విజయం. నాది ఓటమియే సుమా!" రైలు కిటికీ మీద వుంచిన ఆమె చేతిని సున్నితంగా అదిమాడు. ఆ చేతిమీద తనరెండో చెయ్యుంచింది కల్పన.

"ఓటమి గాని, గెలుపుగాని మనిద్దరికీ విడివిడిగా వుండవ్" అన్నది, తన కంట తడి అతని కంట పడకుండా.

"జయం" అన్నట్లు కెనడా ఇంజను 'భాం'మంది. రైలు కదిలిపోయింది. అతని "తనువ"క్కడే వున్నా హృదయం రైలుతో వెళ్లిపోయింది. . ఆమె తనువు రైల్లో వున్నా హృదయం యిక్కడే వుండిపోయింది!....

(1960 ఆంధ్రప్రభ వారపత్రిక)